జీలుగసాగుతో భూసారం

- సేంద్రియ ఎరువుల వినియోగంతోనే అధిక దిగుబడి
- విస్తృతంగా ప్రచారం చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు
- జీలుగపై ఆసక్తి చూపుతున్న రైతులు

భూసారం పెంపుకోసం జీలుగ సాగుచేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. సేంద్రియ ఎరువుల వినియోగంపై వ్యవసాయ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి ఏటా వ్యవసాయశాఖ ఈ విత్తనాలను సబ్సిడీపై అందజేస్తోంది. గ్రామాల్లో జీలుగ సాగుపై అధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. జీలుగతోపాటు జనుము, జింకులను తక్కువ ధరకు అందిస్తుండటంతో విత్తే ముందు వీటిని సాగు చేసేందుకు ముందుకు వస్తున్నారు.

– మాగనూర్


వర్కూర్‌లో సాగుచేసిన జీలుగ పంట (ఫైల్)

రైతులు ఈ ప్రాంతంలో ఎక్కువగా వరిపంటను మాత్రమే సాగుచేసేందుకు ఆసక్తి చూపెడుతుంటారు. తర్వాత స్థానంలో పత్తి పంటను సాగు చేస్తుంటారు. ఎక్కువగా మండల పరిధిలోని నేరడగం, వర్కూర్, ఉజ్జెల్లి, తళంకేరి, మాగనూర్, వాడ్వట్, కొత్తపల్లి, అడవిసత్యవార్, కొల్పూర్, మందిపల్లి తదితర గ్రామాలకు చెందిన రైతులు జీలుగను సాగు చేసేందుకు ముందుకు వస్తున్నారు. వరి పంటను సాగు చేసేముందు దుక్కి దున్ని జీలుగ విత్తనాలు వేస్తుంటారు. ఈ పంట వేసిన 40రోజుల తర్వాత దుక్కిదున్నడంతో భూసారం పెరిగి పంటలు చీడ పురుగుల భారీన పడకుండా కాపాడుతుంది. రైతులు ఎక్కువగా కష్టపడకుండా భూసారాన్ని పెంచుకోవచ్చు. ప్రస్తుతం పంటల సాగు విధానంలో మార్పులతో ఏ గ్రామంలో ఎన్ని ఏపీ పంటలు సాగు చేయాలో వ్యవసాయ అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

ఉపయోగాలు..

జీలుగ పంట ప్రధాన పంటకు ముందస్తుగా నేలను తయారు చేస్తుంది. జీలుగతో పంటకు మూడు టన్నుల జింకును పచ్చిరొట్ట ఎరువుల ద్వారా లభిస్తుంది. జీలుగను భూమిలో దున్నడంతో నత్రజనిని 27శాతం, భాస్వరం 53శాతం, పోటాషియం 22శాతం అందిస్తాయి.

సాగు విధానం..

- జీలుగు పంట ఎకరాకు పొలంలో 25కిలోల విత్తనాలు, పది కిలోల యూరియా వెదజల్లాలి.
- విత్తనాలు వెదజల్లిన తర్వాత ట్రాక్టరుతో దున్నాలి.
- వేసిన 30నుంచి 40రోజుల్లో పంట మంచి పూతదశకు చేరుకుంటుంది.
- పూతదశలో జీలుగు పంటను రోటవేటర్, ఎద్దుల సాయంతో భూమిలోకి దున్ని వేయాలి.
- సింగిల్ సూపర్ పోటాష్ ఎరువును భూమిలో చల్లాలి. అనంతరం నీటితో తడిపి పెట్టాలి. దీంతోపైర్లు కుళ్లిపోయి పచ్చిరొట్ట ఎరవుగా మారుతోంది.

అవగాహన కల్పిస్తున్నాం..



సేంద్రియ ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. జీలుగతోపాటు జీవామృతం తయారి విధానం, భూసారం పెంపుకోసం పాటించాల్సిన పరిస్థితులను వివరిస్తున్నాం. భూసార పరీక్షలు నిర్వహించి ఏపీ పంటలు సాగు చేయాలో తెలియజేస్తున్నాం. రైతులు పంటల సాగులో సేంద్రియ ఎరువులే వాడాలి. పంటలకు తెగుళ్ల ఆశించకుండా ఉండాలంటే వ్యవసాయ అధికారులు సూచనలు పాటించాలి.

– సుదర్శన్‌గౌడ్, ఇన్‌చార్జి ఏఓ, మాగనూర్

క్లుప్తంగా

రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి

మాగనూర్: మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటుచేసిన రైల్వేస్టేషన్‌కు డబల్ లైన్ రోడ్డు ఏర్పాటుచేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ దారి గుండా నిత్యం పలు గ్రామాల ప్రజలు ప్రయాణం కొనసాగిస్తుంటారని రోడ్డు విస్తరణ చేపటడంతో ఈ ప్రాంతం కొంతమేర వ్యాపార సముదాయలు కూడా ఏర్పడి మండల అభివృద్ధి చెందేందుకు అవకాశాలున్నాయని తెలిపారు. అధికారులు భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా సీసీ రోడ్డు



మాగనూర్: మండల పరిధిలోని కొల్పూర్‌లో మూడుమాల్‌కు వెళ్లే దారిలో సీసీ రోడ్డు నిర్మించారు. అయితే సీసీతోపాటు డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాల్సి ఉన్న కేవలం సీసీ రోడ్డు మాత్రమే నిర్మించడంతో వర్షాలు కారణంగా వరద నీటికి మట్టి మొత్తం కొట్టుకుపోవడంతో ప్రస్తుతం సీసీ కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. ప్రమాదకరంగా మారిన అధికారులు ఇటుగా చూడటం లేదని గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

తొందరపడి విత్తనాలు నాటొద్దు

మరికల్: ఒకటి రెండు వర్షాలకు రైతులు తొందరపడి విత్తనాలు నాటి నష్టపోవద్దని ఏఓ శివకుమార్ గురువారం ఒక ప్రకటనలో అన్నారు. నైరుతి రుతు పవనాలు ప్రవేశించి వర్షాలు కురిసిన తర్వాతనే విత్తనాలు నాటాలన్నారు. ప్రస్తుతం విత్తనాలు నాటితే ఎండలకు విత్తనాలు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. ఈ విషయాన్ని పత్తి విత్తనాలు నాటే రైతులు గమనించాలని సూచించారు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ



కోస్గి: మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన దివ్యాంగులకు కమిట్‌మెంట్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక కమిట్ మెంట్స్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు దివ్యాంగులకు సైకిళ్లను పంపిణీ చేశారు. దివ్యాంగుల అభివృద్ధికోసం చేయుతనిస్తూ తమ సంస్థ తరుపున ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆ సంస్థ స్థానిక ప్రతినిధులు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ పీఆర్వోలు నారాయణమ్మ, సరితతోపాటు పలువురు పాల్గొన్నారు.

'రాష్ట్ర రాజముద్ర మార్చొద్దు'

అమరచింత: తెలంగాణ రాష్ట్ర రాజముద్రలో చార్మినార్‌తో పాటు కాకతీయుల తోరణాన్ని తొలగించొద్దని, అవి తెలంగాణ సంస్కృతిని చాటి చెబుతున్నాయని తెలంగాణ ఉద్యమకారుడు సయ్యద్ కలాంపాషా అన్నారు. కొత్త ప్రభుత్వం రాష్ట్ర రాజముద్రికలో మార్పులు చేస్తామని ప్రకటించడం సరికాదన్నారు. గతంలో చార్మినార్‌కు 400 ఏళ్ల సందర్భంగా సంబురాలను చేసిన కాంగ్రెస్ పార్టీ నేడు చార్మినార్‌ను రాజముద్ర నుంచి తొలగించేందుకు యత్నాలు చేయడం తగదన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

నారాయణపేట రూరల్: పట్టణంలోని 3వ వార్డు పరిధిలో శ్రీ నగర్‌కాలనీలో గత కొంతకాలంగా తీవ్రంగా తాగునీటి ఎద్దడి నెలకొంది. దీనిపై మాజీ కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ దృష్టిసారించి, సమస్యను మున్సిపల్ కమీషనర్ దృష్టికి తీసుకెళ్లారు. వినతిపత్రం ఇచ్చిన వెంటనే కమీషనర్ సునిత కాలనీకి వెళ్లి మున్సిపల్ ఇంజనీయర్, ఇతర సిబ్బందితో కలిసి పరిష్కారానికి మార్గం సిద్ధం చేయించారు. ఈ మేరకు గురువారం పైప్‌లైన్ పనులు చేయించి తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేయించారు. కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.



విత్తనాలు, ఎరువులు పంపిణీ చేయాలి


ఊట్కూర్‌లో అధికారులకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఊట్కూరు: ప్రభుత్వం రైతులకు ఖరీప్ సీజన్‌లో విత్తనాలు, ఎరువులను తక్షణమే అందించాలని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం డిప్యూటీ తహసీల్దార్, వ్యవసాయ అధికారి గణేష్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ 50శాతం సబ్సిడీపై రైతులకు విత్తనాలు, ఎరువులను అందించాలని కోరారు. దళిత గిరిజన రైతులకు ఉచితంగా సరఫరా చేయాలన్నారు. పలు చోట్ల డీఏపీ కాంప్లెక్స్ ఎరువులను కొంత దళారులు ఎక్కువ ధరకు అమ్ముతున్నారని వ్యవసాయ అధికారులు విచారణ చేపట్టి రైతులకు న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వం ఆగస్టు 15లోపు రూ. 2లక్షల రుణమాఫీని ఏకకాలంలో చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బాబు, చిన్నబాలు, చిన్నరాములు, సాగర్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మద్దూర్: రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను ప్రభుత్వమే 50శాతం రాయితీపై అందించాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. రైతులకు అవసరమైన జీలుగ విత్తనాలు సరపడ లేకపోవడంతో రైతులు విత్తనాల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రైతులకు ఇచ్చిన హామిలన్నింటిని ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు నర్సింహులు, అంజప్ప, వెంకటప్ప, రాములు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దు

దామరగిద్ద: విత్తనాలు కొనుగోలులో నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దని మండల వ్యవసాయ అధికారి ప్రదీప్ కమార్ అన్నారు. గురువారం మండలంలోని గడిమున్కన్‌పల్లిలో ఉపాధికూలీలతో సమావేశమై విత్తనాలు, ఎరువులు కొనుగోలు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తక్కువ ధరకు అందిస్తామని గుర్తుతెలియని లైసెన్స్‌లేని వ్యక్తుల వద్ద లూజు విత్తనాలు లేదా కంపెనీ లోగో లేని నకిలీ ప్యాకెట్ విత్తనాలు కొనుగోలు చేయొద్దని వివరించారు. ప్రభుత్వ లైసెన్స్ కలిగిన డీలర్‌ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, కొన్న విత్తనాలకు రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆయా క్లస్టర్ పరిధిలో ఏఈఓలు సైతం రైతులకు ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. అనంతరం ఏఎంఈ ఆగ్రోస్, రైతు సేవా కేంద్రాలు, ఇతర ఫర్టిలైజర్ దుఖాణాలను తనిఖీ చేశారు. అనంతరం రైతులకు నాణ్యమైన ఎరువులు విత్తనాలు అందించాలని ఆదేశించారు.


గడిమున్కన్‌పల్లిలో మాట్లాడుతున్న ఎంఏఓ ప్రదీప్ కుమార్

దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన


తహసీల్దార్ రాజుకు వినతిపత్రం ఇస్తున్న దళిత సంఘాల నాయకులు

ఆత్మకూర్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కించపరుస్తూ వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు పెట్టడంతో అంబేడ్కర్ యువజన సంఘం, దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి పోలీసులకు, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. గురువారం మండలంలోని ఆరేపల్లికి చెందిన బీజేపీ నాయకుడు తెలుగు వేణు వాట్సాప్ గ్రూపుల్లో అంబేడ్కర్‌ను కించపరుస్తూ రిజర్వేషన్ల విషయంలో వాయిస్ మెసేజ్ పెట్టినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న ఆయా సంఘాల నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి తహసీల్దార్ రాజుకు వినతిపత్రం అందజేశారు. అలాగే నిందితుడిపూ చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐ నరేందర్‌కు ఫిర్యాదు చేశారు. ఆరేపల్లి వేణుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కుర్మన్న, నర్సింహ, సుధాకర్, ప్రకాష్, లాలు, మధు, కిషోర్, కురుమూర్తి, రంజిత్, దండు శ్రీను, రమేష్, ఆనంద్ ఉన్నారు.

పోచమ్మ ఆలయానికి దారి ఏర్పాటు

గండేడ్: వెన్నాచేడ్‌లో పోచమ్మ ఆలయానికి దారి నిర్మాణం చేసేందుకు గురువారం శ్రీకారం చుట్టారు. ఇదివరకు ఆలయానికి వెళ్లాలంటే నానాపాట్లు పడాల్సి వచ్చేది. ఏళ్ల తరబడి పంటపొలాల గెరుసుల మీదుగా నడిచి వెళ్లేవారు. బోనాల పండుగ వర్షం కాలం ప్రారంభం అయ్యాక రావడంతో ప్రతిసారి మహిళలు బోనాలు ఎత్తుకుని బురదలో నడిచి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామస్తులంతా సమావేశం నిర్వహించి దారి నిర్మాణానికి సంకల్పించారు. ఆపొలాల రైతులను ఒప్పించి గుడి దగ్గరకు వెళ్లేలా తీర్మానించారు. ఇందులో భాగంగానే గురువారం కూలీలతో చదును చేయించి మట్టి తీసుకుచ్చి పోయించారు. తాత్కాలికంగా వేసిన రోడ్డును తరువాత పటిష్టం చేస్తామని స్థానికులు తెలిపారు. కన్వీనర్ నారాయణరెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.


చదును చేస్తున్న కూలీలు

వరుస దొంగతనాలతో ప్రజల్లో భయం

మాగనూర్: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో గత పది రోజుల వ్యవధిలో జరుగుతున్న వరుస దొంగతనాలతో ప్రజలు హడలిపోతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలో దొంగల భయం రోజు రోజుకు పెరిగిపోతుంది. ముఖ్యంగా దొంగలు మూగజీవాలు, వ్యవసాయ బోర్లపై పడ్డారు. గురువారం తెల్లవారు జామున కొల్పూర్ సమీపంలోని ఓ గొర్రెల మందపై దొంగలు పడి 18 గొర్రెలు అపహరించుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. ఆ గ్రామస్తులు రాత్రి సమయంలో చాలా దూరం వరకు దొంగలను వెంబడించిన దొరకలేదని తెలిసింది. వరుస దొంగతనాలు జరుగుతున్న పోలీసువారి నుంచి మాత్రం స్పందన కరువైందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు పనిచేయకపోవడం కూడా దొంగలకు బాగా కలిసి వస్తున్న అంశంగా ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసి దొంగలను నియంత్రించాలని కోరుతున్నారు.

చెత్త కుప్పలో ఓటర్ స్లిప్పులు



కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్‌లో బీఎల్ఓలు ఓటర్‌ల స్లిప్పులను సరిగ్గా పంపిణీ చేయకపోవడంతో పార్లమెంట్ ఎన్నికల్లో దాదాపు 200మంది తమ ఓటుహక్కును వినియోగించుకోలేక పోయారని గ్రామ మాజీ సర్పంచ్ అంబ్రేష్, బీఆర్ఎస్ నాయకులు సురేష్, పంతిగి అంజప్ప ఆరోపించారు. గురువారం గుడెబల్లూర్‌లోని ఓ బీఎల్ఓ ఇంటి ఆవరణతోపాటు వారి ఇంటి సమీపంలోని చెత్త కుప్పలో ఓటర్ స్లిప్పులు దర్శనమిచ్చాయి. గ్రామానికి చెందిన యువకులు, బీఆర్ఎస్ నాయకులు బీఎల్ఓల నిర్లక్ష్యంపై ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

పట్టణ అభివృద్ధే ధ్యేయం

ఆత్మకూర్: మున్సిపాలిటీలోని వార్డుల్లో ఎప్పటికప్పుడు సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం చేస్తూ వార్డుల అధికారులు ముందుకెళ్లాలని కమిషనర్ నాగరాజు అన్నారు. గురువారం మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ వార్డుల అధికారులతో సమావేశమయ్యారు. ప్రతినిత్యం వార్డుల్లో పర్యటించి సమస్యలను గుర్తించాలని, నీటి సరఫరా, పారిశుద్ధ్యం, జనన, మరణాలు, జనాభా, సమగ్ర సమాచారం అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

కోస్గి: రసాయనిక ఎరువుల వాడకంతో భూములు సారవంతం కోల్పోవడంతో ఆశించిన దిగుబడి రావడం లేదని, ప్రకృతి వ్యవసాయంతో నేలకు ఆరోగ్యం కలగడంతోపాటు నాణ్యమైన పంట దిగుబడిని సైతం సాధించవచ్చునని పలువురు ప్రకృతి వ్యవసాయ నిపుణులు సూచించారు. ఈ మేరకు గురువారం స్థానిక శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర శివ సాయి అయ్యప్ప ఆలయాల ప్రాంగణంలో షిర్డి సాయి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పలువురు జిల్లా వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ అధికారులు హాజరై ప్రకృతి వ్యవసాయంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. రైతులు రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోవాలని, ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న రైతులు ప్రకృతి వ్యవసాయం చేసి పండించిన పంటలను విక్రయించేందుకు కావాల్సిన ధ్రువీకరణ పత్రాలను వ్యవసాయ శాఖ నుంచి పొందడం ద్వారా పంట అమ్మకాలను అధిక ధరలకు చేపట్టవచ్చునన్నారు. ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి అత్యాధునిక సాంకేతిక సమాచారం వ్యవసాయ శాఖ నుంచి పొంది రైతులు మరింత ప్రయోజనం పొందాలని అధికారులు సూచించారు. ప్రకృతి వ్యవసాయ విధానంతో పంటల నాణ్యత, అధిక దిగుబడి, మార్కెట్‌లో ఉన్న డిమాండ్, రసాయనిక ఎరువుల వినియోగంతో కలిగే నష్టాలను పలువురు సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు హన్మంతు, డీఏఓ జాన్ సుధాకర్, ఏడీఏ నగేష్, ఏఓ రామకృష్ణ, ఎన్‌జీఓ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి

గ్రామీణ క్రీడాకారులు రాణించాలి

మరికల్: గ్రామీణ క్రీడాకారులు రాణించాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని తీలేర్ గ్రామంలో వారం రోజులపాటు నిర్వహించిన తీలేర్ ప్రీమియర్ లిగ్ క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా వారు విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది తీలేర్ ప్రీమియర్ లీగ్ పోటీలను నిర్వహించి గ్రామీణ క్రీడాకారుల నైపుణ్యాలను బయటకు తీసేందుకు దోహద పడేందుకు కృషి చేస్తామన్నారు. క్రీడాకారులు కూడా గెలుపు, ఓటములను సహజంగా తీసుకొని విజయం కోసం ప్రయత్నం చేసిన వారే భవిష్యత్‌లో విజయం పొందుతారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రేవతమ్మ, భజరప్ప, కుర్మన్న, రాంచంద్రయ్య, తదితర క్రీడాకారులు పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


టౌన్ పీఎస్ వద్ద అవగాహనకల్పిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

నారాయణపేట రూరల్ : సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతుండటంతో సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వెంకటేశ్వర్లు సూచించారు. టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ప్రయాణికులు, వాహనదారులతో గురువారం మాట్లాడి అవగాహన కల్పించారు. అపరిచితులపై అప్రమత్తంగా ఉండాలని, తెలియని వారికి సెల్‌ఫోన్ ఇవ్వడం చేయొద్దన్నారు. అనవసరమైన లింకులు మొబైల్‌కు వస్తే ఓపెన్ చేయరాదని, లాటరీ తగిలిందని, తక్కువ ధరలకు ఆన్‌లైన్‌లో వస్తువులు అమ్ముతున్నట్లు ప్రకటనలు చూసి మోసపోవద్దన్నారు. ఎక్కడైన అనుమానం వస్తే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 193కుగాని డయల్ 100, 112లకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలన్నారు. నకిలీ, నాసిరకం విత్తనాలను కొనిమోసపోవద్దని, బాల్యవివాహాలు, చిన్నపిల్లలను పనిలో పెట్టడం నేరమని, జైలుశిక్ష తప్పదని హెచ్చరించారు. ఏఎస్ఐ ఆంజనేయులు, కానిస్టేబుల్ మల్లేష్, సృజన పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


మాట్లాడుతున్న నాగురావునామాజీ

నారాయణపేట రూరల్: ఆటలు ఆడటంతో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం లభిస్తాయని ఎస్ఎస్‌కే సమాజ్ జాతీయ ఉపాధ్యక్షుడు నాగురావు నామాజీ అన్నారు. స్థానిక సోమవంశ క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కేపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చిన్నతనం నుంచి చదువుతోపాటు సమాంతరంగా పిల్లలకు క్రీడలపై మక్కువ పెంచాలన్నారు. ఆటలు ఆడటంతో శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. చెడు వ్యవసనాలకు బానిస కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. అంతకు ముందు సహస్రార్జున్ మహారాజ్ చిత్రపటానికి పూజలు చేశారు. కార్యక్రమంలో నారాయణరావు, నాగురావు, నందునామాజీ, యువత పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం


బహుమతులను ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్: గ్రామాల్లో క్రీడలతో స్నేహభావం పెరుగుతుందని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం మండలంలోని గడ్డంపల్లిలో సవారమ్మ జాతర సందర్భంగా రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలో గెలుపొందిన వారికి ఎమ్మెల్యే చేతుల మీదుగా నగదు బహుమతిని అందజేశారు. ప్రతి ఒక్కరూ కబడ్డీ పోటీలో గెలుపు ఓటములు సహజమని అన్నారు. పట్టుదల ఉంటే ఎదైన సాధించగలమని అన్నారు. అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రకాంత్‌గౌడ్, గడ్డంపల్లి హన్మంతు, మాజీ మార్కెట్‌చైర్మన్ రవికుమార్ యాదవ్, మాజీ ఎంపీటీసీ కోళ్ల వెంకటేష్, కావలి శ్రీహరి పాల్గొన్నారు.

బీసీల చైతన్యమే ధ్యేయంగా పనిచేద్దాం

నారాయణపేట రూరల్: తెలంగాణలో బీసీల చైతన్యమే ధ్యేయంగా పనిచేస్తామని బీసీ సేనా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బూరుగుపల్లి కృష్ణ యాదవ్ అన్నారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఆ సంఘం నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ నూతన అధ్యక్షుడిగా ఎడ్లకుర్మయ్య, ఉపాధ్యక్షుడిగా గణేష్‌లను నియమించారు. అనంతరం వారికి నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీసీలకు న్యాయం జరగడంలేదని వాపోయారు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా పైకి రావాలంటే సంఘటితంగా కలిసి ముందుకు సాగాలన్నారు. బీసీల వాటాకు కోత పెడితే ఊరుకునేదిలేదని, రిజర్వేషన్‌లో తగిన న్యాయం జరగాలన్నారు. రాబోయే రోజుల్లో అవసరమైతే ఉద్యమ కార్యాచరణ సిద్ధం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, జిల్లా కన్వీనర్ వీరేష్, ఆంజనేయులు, వెంకటేష్ పాల్గొన్నారు.


నియామక పత్రం అందిస్తున్న కృష్ణ యాదవ్

వర్షాలు కురవక..

మరికల్: వర్షాలు కురుస్తాయని ఆశతో నాటిన పత్తి విత్తనాలు మొలకెత్తకపోవడంతో నీటి వనరులు ఉన్న రైతులు భూమిలో నాటిన పత్తివిత్తనాలను కాపాడుకునేందుకు భూమిని తడుపుతు తంటాలు పడుతున్నారు. ఇప్పటికే మండలంలో దాదాపు 25శాతం రైతులు పత్తి విత్తనాలను తమ పొలాల్లో నాటినట్లు ఫర్టిలైజర్ దుఖాణదారులు అంచన వేస్తున్నారు. ఇటీవల కురిసిన మోస్తారు వర్షానికి రైతులు తొందరపడి పత్తి విత్తనాలు నాటారు. నీటి వనరులు లేని రైతులు మాత్రం ఇప్పటికే ఎకర వెంబడి రూ. 15వేల నష్టం చవి చూశారు.


మరికల్‌లో పొలానికి నీళ్లు పెడుతున్న రైతు